epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



## బెట్టింగ్ యాప్‌కు యువకుడి బలి

- హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్

4

సంపుటి : 01 | సంచిక : 55 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 23 జనవరి 2026 | పేజీలు : 04



# సమస్యల సాధనకు ఐక్యంగా పోరాడాలి

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



**వరంగల్, మన చౌరాస్తా :** రాష్ట్రంలో కల్లు గీత పనివారలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు జరపాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో గీత పని వారల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరి తిరుపతి, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి తో కలిసి గీత పని వారల సంఘం క్యాలెండర్ ను వెంకట్రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రపంచీకరణ ,సరళీకరణ విధానాలతో గీత, చేనేత, మత్స్య, రజక, గొర్రెల పెంపకం తదితర వృత్తులన్ని విధ్వంసం అయ్యాయని, ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించడంలో పాలకులు విఫలమైనారన్నారు. గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత పనివారలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను రెండేళ్లు దాటిన అమలు పరచకపోవడం విడ్డురంగా ఉందన్నారు. ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు బొమ్మగాని ధర్మభిక్షం నిజాం పాలనలో "గీసే వాడిదే చెట్టు" నినాదంతో స్థాపించిన గీత పని వారల సంఘం అనేక ఉద్యమాలు నిర్వహించి సహకార సంఘాల ఏర్పాటు , ఎక్స్రేసియో పలు హక్కులను సాధించిందన్నారు. పెండింగ్ లో ఉన్న రూ. 12 కోట్ల ఎక్స్ గ్రేషియో బకాయిలు వెంటనే చెల్లించాలని, గీత కార్మికులకు ఇస్తున్న కిట్స్ లు అందరికి ఇవ్వాలని వృత్తిదారులందరు ఐక్యమై సమస్యల పరిష్కారానికి పోరాడాలని వెంకట్రాములు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలోపల్లె రాజుగౌడ్, పట్టాపురం ఏకాంతం గౌడ్, చిర్ర శ్రీనివాస్ గౌడ్, పెద్దగాం మధుకర్, అనంతుల రమేష్‌గౌడ్, అర్జున్, చెలుకల రాజు, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత పోస్టర్ ఆవిష్కరణ

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రీజినల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ సభ్యులు చిలువేరు అభి గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన రోడ్డు భద్రతా అవగాహన పోస్టర్‌ను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల ఝాన్సీ యశస్విని రెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు చొరవ తీసుకున్న చిలువేరు అభి గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాలకుర్తి నియోజకవర్గం, జనగామ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ క్షేమంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు.



# శంకరమంచికి సన్మానం

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాదులోని భారతీయ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) భారతీయ విద్యా భవన్ లో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ ను ఆ విద్యాలయ ప్రిన్సిపల్ చేబ్రోలు ఉమ, ఆ విద్యా సంస్థల విద్యావిషయక సలహాదారు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మదన్ రావులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యా భవన్ అధ్యాపక వర్గం పాల్గొన్నారు.

# వంగరలో జాగృతి బృందం అవగాహన కార్యక్రమం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** వరంగల్ నగర పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు పోలీస్ జాగృతి కళా బృందం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని డాక్టర్ పి.వి.ఆర్.ఆర్. తేజరాం గోవిందరావు పాఠశాల మరియు బాలికల జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా వంగర ఎస్ ఐ దివ్య మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని చెప్పారు. ముఖ్యంగా బాలికలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని, మోసాల బారిన పడితే 1930 సహాయ కేంద్రానికి ఫోన్ చేయాలని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ, అత్యవసర సేవలు, మహిళల రక్షణ బృందాలు, బాల్య వివాహాల నివారణ, ఆడపిల్లలపై వేధింపులు, విద్యార్థుల వేధింపులు, మానవ అక్రమ రవాణా, బాధితులకు సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు చెప్పిన మాట వినాలని, మంచి మార్గంలో నడవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ జాగృతి కళా బృందం సభ్యులు సామాజిక సమస్యలపై పాడిన పాటలు విద్యార్థులను ఆలోచింపచేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల మరియు కళాశాల ప్రధానులు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, కళా బృంద సభ్యులు, బాలికల కళాశాల విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.






# గాంధీ పేరు తొలగిస్తే మరో ఉద్యమం

**కొమరవెల్లి, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బడుగు బలహీన వర్గాలకు ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పేరుతో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసింది కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగిస్తే మరో ఉద్యమానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరు తొలగించడానికి నిరసనగా ఏఐసీసీ, పీసీసీ పిలుపులో భాగంగా జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాప రెడ్డి మరియు సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షులు ఆంక్షరెడ్డి ఆదేశాలమేరకు ఈరోజు కొమరవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలం లోని గౌరాయపల్లి, అయినాపూర్, రసులాబాద్ మరియు రామ్ సాగర్ గ్రామాలలో ఉపాధి హామీ పనిచేసే వాళ్ళ దగ్గరికి వెళ్లి ఈ పథకం రద్దు చేస్తే వచ్చే నష్టాలను వారికి తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ దేశం కోసం శాంతియుతంగా ఉద్యమం చేసి స్వాతంత్రం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీని ప్రపంచదేశాలు పూజిస్తుంటే మనదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు అలాగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు రచించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడానికి పూనుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు మహాత్మా గాంధీ స్వరాజ్యం ఇచ్చిన స్ఫూర్తితో కాంగ్రెస్ కార్యకర్తలు మహాత్మా గాంధీ పేరు మార్పు నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తీవ్ర ఆందోళనను చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాస్, మండల కిసాన్ సెల్ అధ్యక్షులు బొచ్చు ఎల్లయ్య యాదవ్, ఐనాపూర్ గ్రామ సర్పంచ్ ఎరుపుల కళ్యాణి కృష్ణ, ఐనాపూర్ గ్రామ అధ్యక్షుడు మల్లం బాలయ్య,చెరుకు రమణారెడ్డి, వార్డు మెంబర్స్ దండు శ్రీనివాస్, దండు రవీందర్, కొమ్ము రాములు, రసూలాబాద్ గ్రామ అధ్యక్షుడు జనగాం శ్రీకాంత్, చేర్యాల డివిజన్ ఆత్మ కమిటి డైరెక్టర్ చింతల పరిశరాములు, K మోహన్ రెడ్డి, పాక్స్ మాజీ డైరెక్టర్ బత్తిని నర్సింలు, దండు నర్సింలు, దీకొండ నర్సింలు, ఎరుపుల సాయిబాబు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేష్మ బేగం, గౌరాయపల్లి మాట్ల మురళి, వెంకటనరస్మిహారెడ్డి, బి కిషన్ బి.సంపత్, డీ.బాబులు యం .యాదగిరి యం.మురళి డీ.బాబులు, యం.బాబు సాయికృష్ణ, స్వామి, రేణుక మల్లేశం, ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీకి భూమి రాసిచ్చిన పూజారి

**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** పెంచికల్పేట గ్రామానికి చెందిన పూజారి నాగిళ్ల వెంకటేశ్వర్లు తనకున్న వ్యవసాయ భూమిని గ్రామ పంచాయతీకి రాసిచ్చాడు. తన కుమారులు వృద్ధాప్యంలో తనను చూసుకోవడం లేదని చెప్పుతూ, గ్రామస్తుల సమక్షంలో సంతకం చేసి భూమి అప్పగింతకు సంబంధించిన పత్రాన్ని ప్రజలకు అందించాడు. వివరాల్లోకి వెళితే, నాగిళ్ల వెంకటేశ్వర్లుకు చెందిన తండ్రి కోనయ్యను భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామం నుంచి కొన్నేళ్ల క్రితం పెంచికల్పేట గ్రామస్తులు పురోహితునిగా తీసుకొచ్చారు. జీవనోపాధి కోసం అతనికి 4 ఎకరాలు 38 గుంటల భూమిని అప్పగించారు. అప్పటినుంచి కోనయ్య కుమారుడైన వెంకటేశ్వర్లు గ్రామంలో పురోహితునిగా సేవలందిస్తూ ఆ భూమిని సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు కోటేష్ తనకు, భూమికి, గ్రామానికి సంబంధం లేదని చెప్పి వేరే చోట పురోహితునిగా పనిచేస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో తన పిల్లలెవరూ తనను పట్టించుకోవడం లేదని వెంకటేశ్వర్లు తెలిపాడు. గ్రామస్తులే తన బాగోగులు చూసుకుంటున్నారని పేర్కొన్నాడు. అందుకే తనకున్న మొత్తం భూమిని గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నానని గ్రామస్తుల సమక్షంలో గురువారం గ్రామ పంచాయతీ లెటర్ ప్యాడ్‌పై భూమి అప్పగింత హామీ పత్రాన్ని రాసిచ్చాడు. పూజారి వెంకటేశ్వర్లు తీసుకున్న ఈ నిర్ణయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# స్వలాభం కోసం హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలిపే ప్రయత్నం

## వొడితెల సతీష్ కుమార్



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** తన రాజకీయ లబ్ధి కోసమే హుస్నాబాద్‌ను కరీంనగర్ జిల్లాలో విలీనం చేయడానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కుట్రలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం హుస్నాబాద్ పట్టణంలో హనుమకొండ రోడ్డునుంచి సిద్దిపేట రోడ్డువరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ, హుస్నాబాద్, కోహెడ, అకన్నపేట మండలాలను ప్రజల అభిప్రాయం మేరకే గ్రామసభలు నిర్వహించి శాస్త్రీయంగా సిద్దిపేట జిల్లాలో కలిపామని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విస్మరించి మంత్రి పొన్నం మాట్లాడటం అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఆర్డీఓ, ఏసీపీ కార్యాలయాల ఏర్పాటు కోసం గతంలో కాంగ్రెస్ నాయకులే ధర్నాలు చేశారని గుర్తు చేశారు. కరీంనగర్‌లో విలీనం కావాలని ప్రజలు కోరడం లేదని, మంత్రి తన స్వప్రయోజనం కోసం అనవసర వివాదాలు సృష్టిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. మరోసారి హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుపుతామన్న మాట తెస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. గత రెండేళ్లుగా అభివృద్ధి పేరుతో మంత్రి మాటలకే పరిమితమయ్యారని, ఒక్క పూర్తి చేసిన పని కూడా చూపలేకపోతున్నారని సతీష్ కుమార్ ఆరోపించారు. రింగురోడ్డు, 250 పడకల దవాఖాన వంటి అంశాల్లో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఉచిత బస్సు ప్రయాణం తప్ప మరే హామీ అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకే బాకీ కార్డుల పంపిణీ చేపట్టామని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి హుస్నాబాద్ మున్సిపల్‌లో గులాబీ జెండా ఎగరవేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూట్ లలో 5వ తరగతి మరియు ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ముస్లిం మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని జనగామ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ విక్రమ్ కుమార్ అన్నారు జనగామ జిల్లా కేంద్రంలోని శామీర్పేట్ మైనారిటీ స్కూల్లో గురువారం మధ్యాహ్నం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఒక బాలుర పాఠశాల, మరియు వేరుగా ఉన్న కళాశాలలో గల సీట్లలో 80 శాతం మైనారిటీలకు, 20 శాతం నాన్ మైనార్టీలకు సీట్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. పాఠశాలల్లో ఐదవ తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో నూతన అడ్మిషన్లతో పాటు ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో బ్యాక్లాగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయని వీటిని మైనార్టీలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మైనార్టీలకు నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు,భోజనం,వసతి, టెక్స్ట్ బుక్స్,నోట్ బుక్స్, యూనిఫామ్స్, షూస్ తో పాటు ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని.. అంకితభావం అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులచే బోధించబడును. కళాశాలలో నీట్ జెఈఈ కోచింగ్ సౌకర్యం కలదన్నారు. tgmreistelangana.cgg.gov.in ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అసిస్టెంట్ అధికారి రవీందర్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ కే. కుమారస్వామి, కళాశాల ప్రిన్సిపల్ పి.అనిల్ బాబు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రహదారి భద్రత మాసోత్సవాల ర్యాలీ

**హుస్నాబాద్, మనచౌరాస్తా :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు అధ్యాపకులతో కలసి హుస్నాబాద్ మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ యోగేశ్వర్సింగ్ శుక్రవారం రోజున రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి మొదలై అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరిగి మల్లెచెట్టు చౌరస్తా వరకు సాగింది. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహణదారులు కచ్చితంగా ట్రాఫిక్ నియమాల గురించి తెలుసుకో వాలని, దాని ప్రాముఖ్యతపై ప్రజలు అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహణదారులకు వివరించారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్టు కానిస్టేబుల్ రవిందర్, పోలీస్ అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ సమ్మక్క సారలమ్మ ఆలయ చైర్మన్‌గా జక్కుల ఐలయ్య నియామకం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూర్ సమ్మక్క సారలమ్మ ఆలయ చైర్మన్‌గా జక్కుల ఐలయ్యను నియమిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ జక్కుల ఐలయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి సమ్మక్క సారలమ్మ జాతర చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీలోని సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు సహా తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధికి సంబంధించి మొబైల్ బాత్రూముల ఏర్పాటు, ఆలయ మరమ్మత్తు పనులకు సహకరిస్తున్న మంత్రివర్యులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ముల్కనూర్ గ్రామ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి సహకారంతో, తన చైర్మన్ పదవీకాలంలో రానున్న సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం భద్రత, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వసతి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆలయ కమిటీలో చైర్మన్‌గా జక్కుల ఐలయ్యతో పాటు డైరెక్టర్లుగా గుడికందుల రాజు, పెంచికల జైపాల్, గీకూరు ఐలయ్య, మద్ది వేణు, మాడుగుల యాదగిరి, పెంట పూర్తి వీరారెడ్డి, కొదురుపాక శ్రీనివాస్, వంగ శ్రీనివాస్, మార్పాటి శ్రీనివాసరెడ్డి, చిదురాల విజయ రెడ్డి, ఎలుకపల్లి రామారావు తదితరులను నియమించారు.





# ములుకనూర్ సహకార సంఘాన్ని సందర్శించిన శ్రీలంక బృందం

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (NIRDPR) మరియు శ్రీలంకలోని భారత హైకమిషన్ సంయుక్తంగా, శ్రీలంకకు చెందిన సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ స్థానిక ప్రజాప్రతినిధుల కోసం ఎక్స్పోజర్ కమ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతినిధి బృందం 2026 జనవరి 19న భారత్‌కు చేరుకుంది. పది రోజుల పాటు సాగనున్న ఈ శిక్షణా కార్యక్రమంలో వ్యవసాయం, ఉద్యానవనం, జీవనోపాధి ప్రోత్సాహం, సహకార బ్యాంకులు, మహిళల నేతృత్వంలోని కార్యక్రమాలు, ఎకోటూరిజం వంటి రంగాల్లో భారతదేశంలో అమలవుతున్న ఉత్తమ విధానాలను పరిచయం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ సహకార రంగంలో దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిన ములుకనూర్ కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీని ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్శనలో భాగంగా ములుకనూర్ సహకార సంఘం చేపడుతున్న వివిధ కార్యకలాపాలు, రైతుల సామాజిక-ఆర్థిక స్థితిగతుల అభివృద్ధికి అందిస్తున్న మద్దతు, మధ్యవర్తుల పాత్రను తొలగించి రైతులకు న్యాయం చేకూర్చే విధానాలను వారికి వివరించారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళల నేతృత్వంలో నిర్వహించబడుతున్న డెయిరీ యూనిట్‌ను కూడా పరిచయం చేశారు.ఈ ఎక్స్పోజర్ కార్యక్రమం ద్వారా ప్రతినిధులు తమ తమ స్థానిక మండలాల్లో అమలు చేయదగిన ఉత్తమ పద్ధతులను అవగాహన చేసుకొని, వాటిని అమలు చేసే దిశగా ప్రేరణ పొందుతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ములుకనూర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు ఆలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్రతినిధులతో పరస్పర చర్చలు నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అంతర్జాతీయ ప్రతినిధి బృందం కోసం ములుకనూర్ కోఆపరేటివ్‌ను ఎంపిక చేయడం ములుకనూర్ మోడల్ తన సభ్య రైతుల జీవితాల్లో తీసుకొచ్చిన గణనీయమైన మార్పులకు నిదర్శనమని ఆయన తెలిపారు. తమ ప్రాంతాల్లో సాధ్యమైన మేరకు ఈ మోడల్‌లోని కార్యక్రమాలను అమలు చేయాలని ప్రతినిధులకు సూచించారు.

## బెట్టింగ్ యాప్‌ల మాయలో

# యువ జీవితం ముగిసింది

### నానమ్మ ఆశలు, మనవడి కలలు.. చివరకు కన్నీటి కథగా మిగిలాయి



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు యువతను ఎంత నిర్దాక్షిణ్యంగా మింగేస్తున్నాయో చూపించే మరో హృదయవిదారక ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. తల్లిదండ్రుల ప్రేమకు దూరంగా పెరిగిన ఓ యువకుడు, నానమ్మ కష్టాలను తానే తీరుస్తానన్న ఆశతో పోరాడుతూ చివరికి బెట్టింగ్ యాప్‌ల మాయలో చిక్కుకుని ప్రాణాలు విడిచాడు.

ములుకనూర్ గ్రామానికి చెందిన సుంచు రాంచరణ్ (23) చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి అతడి ప్రపంచం ఒక్క నానమ్మ మధురమ్మే. మనవడే తన బలం, ఆశ, జీవితం అన్నట్టుగా ఆమె అతడిని పెంచి పెద్ద చేసింది. చదువు పూర్తి చేయలేకపోయినా, కష్టపడి పని చేసి నానమ్మను సుఖంగా చూడాలన్న ఒక్క లక్ష్యంతో రాంచరణ్ జీవితం సాగించాడు.

ఉపాధి కోసం మంచిర్యాల జిల్లాకు వెళ్లి ఎన్నో పనులు చేశాడు. నాలుగు నెలల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చి నానమ్మ వద్ద ఉంటూ, తన అక్క అత్తగారు ఊరైన వేలేరులో ఉండేవాడు. కొత్తకొండలోని ఓ పెట్రోల్ బంక్‌లో దినసరి కూలీగా పనిచేస్తూ ప్రతి రోజు కష్టపడి జీవనం సాగించేవాడు. చేతికి వచ్చిన కూలీని నానమ్మ చేతిలో పెట్టి ఆమె ముఖంలో చిరునవ్వు చూడడమే అతడికి ఆనందం.

సంక్రాంతి పండుగకు ముందు నానమ్మ ఇంటి మరమ్మతుల కోసం మహిళా సంఘం నుంచి రూ.90 వేల అప్పు తీసుకున్నారు. "ఇల్లు బాగుచేస్తే మనవడి పెళ్లి కూడా సక్రమంగా జరుగుతుంది" అన్న నానమ్మ కలలకు ఆ అప్పే ఆధారం. ఆ మొత్తాన్ని రాంచరణ్ బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. కానీ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించి నానమ్మ అప్పులు తీర్చాలన్న అమాయక ఆశ అతడిని ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల వైపు నడిపించింది.

మొదట చిన్న మొత్తాలు పెట్టి ప్రయత్నించిన రాంచరణ్, లాభం వస్తుందన్న మాయలో నానమ్మ అప్పు డబ్బుతో పాటు ఇతరుల వద్ద తీసుకున్న అప్పు మొత్తాన్ని కూడా బెట్టింగ్‌లో పెట్టాడు. క్షణాల్లో డబ్బు పోయింది. చేతిలో ఒక్క రూపాయి కూడా మిగలలేదు. ఇంటి మరమ్మతుల కోసం డబ్బులు ఇవ్వాల్సిన రోజు దగ్గరపడుతుండటంతో అతడి మనసు పూర్తిగా కుంగిపోయింది.

"నానమ్మను ఎలా ఎదుర్కోవాలి? ఆమె ఆశలు ఎలా చంపేశాను?" అన్న ఆలోచనలతో అతడి హృదయం చీలిపోయింది. ఆ బాధను భరించలేక సోమవారం నాడు వేలేరు గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులు మృత్యువుతో పోరాడిన రాంచరణ్, చివరకు బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచాడు.మనవడి మృతితో నానమ్మ మధురమ్మ గుండె పగిలిపోయింది. "నా బిడ్డే నా లోకం… నన్ను ఒంటరిగా వదిలేసి ఎందుకు పోయావు?" అంటూ ఆమె విలపిస్తున్న దృశ్యం గ్రామస్తుల కళ్లను చెమర్చేలా చేసింది. యువ వయసులోనే ప్రాణాలు కోల్పోయిన రాంచరణ్ కథ ములుకనూర్ గ్రామాన్ని శోకసంద్రంగా మార్చింది. ఈ ఘటనపై మృతుడి బావ జెట్టి విష్ణు ఫిర్యాదు మేరకు వేలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల యువత ప్రాణాలకే ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, యువజన సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.



## మున్సిపల్ ఎన్నికలకు ప్రణాళికలు

### ■ డీసీసీ అధ్యక్షురాలు ధనవంతి ధన్వంతి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధన్వంతి లకావత్, పీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ ని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జనగామ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ, బలమైన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పై చర్చించారు. జనగామ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల బలోపేతం, బూత్ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు వ్యూహాత్మక ప్రణాళిక వంటి ముఖ్య అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జనగామ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని, కార్యకర్తల సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లే స్పష్టమైన ప్రణాళిక అమలు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## 22, 23న జానపద సంప్రదాయాలపై

# జాతీయ సదస్సు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని జానపద సంస్కృతి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో జానపద సంప్రదాయాలపై రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు మరియు కళా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. "సంప్రదాయాల అవతరణ - దృక్పథాలు, ప్రదర్శనలు" అనే శీర్షికతో ఈ కార్యక్రమం 2026 జనవరి 22, 23 తేదీల్లో జరగనుంది. ఈ సదస్సును హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రత్యక్షంగా, అలాగే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. దేశంలో విశిష్ట ప్రతిభ కలిగిన విద్యాసంస్థలకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రత్యేక నిధులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా-సాంస్కృతిక శాఖల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతోంది. సదస్సులో ప్రముఖ పండితుల ప్రధాన ఉపన్యాసాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు నిర్వహించనున్నారు. అదే విధంగా జానపద సంస్కృతి అధ్యయన కేంద్రం ప్రాంగణంలో ప్రత్యక్షంగా జానపద కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా జానపద సంస్కృతి అధ్యయన కేంద్రం అధిపతి ప్రొఫెసర్ జాలి పుత్తుస్సేరి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పండితులు, పరిశోధకులు, సంస్కృతి కార్యకర్తలు ఈ జాతీయ సదస్సులో పాల్గొననున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బోనాలు, కోలాటం, చిందు యక్షగానం, బుర్రకథ వంటి సజీవ జానపద కళారూపాలు ఈ కార్యక్రమంలో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. జానపద కళాకారులతో ప్రత్యక్ష పరస్పర సంభాషణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ప్రముఖ రంగస్థల, చలనచిత్ర నటుడు, దర్శకుడు డా. జి. కుమారస్వామి, అలాగే నటనాధ్యాపకులు, నాటక రచయిత గడ్డం ప్రశాంత్ పాల్గొననున్నారని ఆయన తెలిపారు. భారతదేశానికి చెందిన సమృద్ధిగా ఉన్న జానపద సాంస్కృతిక వారసత్వాన్ని లోతుగా అనుభవించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందని, విద్యావేత్తల ఆలోచనలు మరియు ప్రదర్శనా సంప్రదాయాల మధ్య సార్థకమైన సంభాషణకు ఇది వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ జోలీ పుతుస్సేరి అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న అన్ని సంస్థలు, సహాయదాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ సజీవ జానపద సంప్రదాయాల వేదికలో భాగస్వాములు కావాలని జానపద సంస్కృతి అధ్యయన కేంద్రం పండితులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజానీకానికి హృదయపూర్వక ఆహ్వానం పలికింది.



## మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

**కొమురవెల్లి మన చౌరాస్తా :** ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కొమరవెల్లి మల్లికార్జున స్వామి 23 రోజుల హుండీని గురువారం లెక్కించారు. నగదు రూ.1,01,24,258, మిశ్రమ బంగారం 50 గ్రాములు, మిశ్రమ వెండి 5 కిలోల 600 గ్రాములు, విదేశీ కరెన్సీ 30 నోట్లు సమకూరాయి. ఈ హుండీ లెక్కింపు లో శ్రీ లలిత సేవ సమితి సేవ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేష్, విజయలక్ష్మి ఇన్స్పెక్టర్ , దేవాదాయ శాఖ సిద్దిపేట డివిజన్, సహాయకార్యనిర్వహణాధికారి బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఫెస్టివల్ కమిటీ సభ్యులు గంగం నర్సింహా రెడ్డి, సార్ల లింగం, చిగిరి కొమురయ్య, బొచ్చు ఎల్లయ్య, గొరిగే రవి, ఏ.మల్లేశం, పి.మహేష్, ఆలయ పర్యవేక్షకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయినగర్‌లో వరి పోస్ట్ హార్వెస్ట్ సాంకేతికతలపై వ్యవసాయ ప్రదర్శన

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా సాయినగర్ గ్రామంలో ఎస్ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు చెందిన తుదివత్సర విద్యార్థులు వరి పంటకు సంబంధించిన కోత అనంతర సాంకేతికతలపై వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కోత అనంతరం పాటించాల్సిన సరైన నిల్వ విధానాలు, ప్రాసెసింగ్ పద్ధతులు, ధాన్య నష్టం తగ్గించే మార్గాలు, తేమ నియంత్రణ, పురుగులు–తెగుళ్ల నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే ఆధునిక యంత్రాల వినియోగం, శాస్త్రీయ పద్ధతుల్లో ఎండబెట్టడం, గోదాముల నిర్వహణ, మార్కెట్ విలువ పెంచుకునే విధానాలపై వివరించారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటికి సాధ్యమైన పరిష్కారాలను సూచించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ భూపాల్‌రాజ్, కార్యక్రమ సమన్వయకర్త శ్రీకర్ రెడ్డి, గ్రామ సమన్వయకర్త డి. గిరీష్, గ్రామ సర్పంచ్ వెంకన్న మద్దతు అందించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతులు విద్యార్థులు నిర్వహించిన ప్రత్యక్ష ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించి, కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని అభిప్రాయపడ్డారు.




## అడిషనల్ కలెక్టర్ ఇంట్లో ముగిసిన సోదాలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. ఉదయం నుంచి హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడలో తనిఖీలు చేశారు. రూ.100 కోట్ల వరకు అక్రమాస్తులను ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. అధునాతనమైన రెండు విల్లాలు, పది ఫ్లాట్స్, 14 ఎకరాల వ్యవసాయ భూమి, రూ.50 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్, మరికొన్ని బినామీ ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**